'...సుఖంగా ఉన్నావుకదా!'

[చిన్న కథ]

'వీస్తోన్న చల్లనిగాలికి నాదగ్గరి వేపచెట్టుమీంది కొమ్మలు ప్రియుల చక్కలిగింతలకు త్రుళ్ళిపడే యువతుల్ని అనుకరిస్తువి...రహస్యంగా ఉపభర్తను కూడుకోటానికి వెళ్ళే వగలాడిగుండె దడదడలాగ బడబడావచ్చేసింది వానజల్లు.'

రచయిత:

పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.యే.

౧

నేను మా పుట్టింటికి వచ్చి నెలరోజు అయింది. మా అమ్మ నాచిన్నప్పుడే చనిపోయింది. సోదరులు లేనేలేరు. మా నాన్నగారు ఒక్కరే ఉన్నారు. అరవైయేళ్ళ వృద్ధుడు. రెండువందల యాభైరూపాయల పెన్షను వస్తుందాయనకు. వయసులో చాల వైభవంగా బతికినవారు. ఈ జరావస్థలో వంటావిడ, మరి ఒకరిద్దరు నౌకర్లూతప్ప ఆయనకు ఉపచారం చేసేవాళ్ళెవరూ లేరు. అందుచేతే ఆయనకు కొంచెం సుస్తీగాఉందని ఉత్తరం రాగానే మావారు నన్నుపంపించారు.

నేను వచ్చిన వారంరోజులకే మా నాన్నగారికి బాగా కులాసాయిచ్చింది. కొంచెం నీరసంగా ఉంటున్నారు, అంతే. నేను తిరిగి వెళ్ళాలని అనుకుంటూనే ఉన్నాను. పంచమి, సప్తమి, దశమి అని గడువులు పెడుతూ రోజులు గడుపుతున్నారు మానాన్న. రమ్మని మావారు ఉత్తరమేమీ రాయలేదు కాని—వారి మనస్సు ఎంత సుతిమెత్తనో శరీరమూ అంతే. హోటలుతిండి సరిపడుతున్నదో, లేదో!

రోజూ సాయంత్రమప్పుడు కొంచెం వ్యాయామంగా ఉంటుంది కదా అని మానాన్న అటు పొలాలవైపో, పార్కులోకో షికారు వెళుతూంటారు. తరచు నన్నూ రమ్మంటూండేవా రాయన.

షికార్లు వెళ్ళటమనేది నాకు చిన్నతనంలోనే పోయింది. నేను కాపురానికి వెళ్ళిన ఈ పదిసంవత్సరాలనించీ ఎవరేనా పిలిస్తే పేరంటానికి వెళ్ళవలసినప్పుడు తప్ప గడపదాటి యెరగను. మావారు రివెన్యూ ఇన్స్పెక్టరుగా పనిచేస్తున్న ఊరు బస్తీ పల్లె కాకుండా ఉంటుంది. అక్కడ పార్కులంటూ ఏమీ లేవు. అది కాక స్త్రీలు షికార్లు వెళ్ళటం చాల నింద్యంగా పరిగణింపబడే వాతావరణం అక్కడ.

అలవాటు లేకపోవటం మూలాన నాకు చాల భిడియంగానే ఉండేది, అనేకమంది పురుషులు వచ్చి కూచుని ఉండే ఆ పార్కులో మా నాన్నగారి పక్క నడుస్తోన్నప్పుడు. కొంతమంది స్త్రీలుకూడా—పెద్దపెద్ద ఉద్యోగస్తుల భార్యలూ, కూతుళ్ళూ వచ్చేవాళ్ళే. కబుర్లు చెప్పుకుంటూనో, పిల్లల నాడిస్తూనో, కిలకిల నవ్వులతో గాలితరంగాల్ని నింపుతూండేవారు. నాకుమాత్రం ఏమిటో భయంభయంగా ఉండేది. మా నాన్నగారి కులాసాకోసం కాకపోతే నేను వెళ్ళకపోయే ఉందును.

వెళ్ళినా నలుగురూ ఉన్నచోట కూచునేవాళ్ళం కాదు. ఆ పార్కు చాలపెద్దది. విజనంగా ఉండే ఒకమూల వేపచెట్టుకింద సిమెంటుబల్ల మాకోసం రిజర్వుచేయబడినట్టు ఎవరూ అక్కడికి వెళ్ళేవాళ్లు కాదు.

మొదటిరోజున ఆ సిమెంటు బల్లమీద మానాన్నగారి మాటలకు జవాబులిస్తూ కూచున్నానేగాని తలెత్తి చూడలేకనే పోయాను. క్రమశః మనుష్యుల కేసి చూడగలిగిన ధైర్యం లేకపోయినా కాస్త ఆ 'రేడియో లౌడ్స్పీకర్ల'కేసి, చెట్లకేసి చూపులు పోనిచ్చాను. చివరకు పార్కులోకి రావటం అంత భిడియపడవలసిన పని కాదని తెలుసుకోగలిగాను.

౨

అనాడు ఆ వేపచెట్టుకింది సిమెంటు

బల్లమీదనే కూచున్నా వెళ్ళి. కూడా వచ్చిన నాన్నగారు ఎవరో స్నేహితుడు కలిస్తే ఆయనతో మాటాడుతూ రేడియో రిసీవింగు స్టేషనులోకి వెళ్ళారు.

ఆకాశంనిండా మేఘాలు కమ్మి ఉన్నై; వర్షం కురుస్తుందేమో అన్న భయం కలిగించేటంత నల్లగా మాత్రం లేవు. సూర్యాస్తమయ మయ్యేవేళ. సూర్యుడు కనిపించటంలేదు: ఆ పశ్చిమభాగమంతా తెల్లని యవనికలాగ ఉంది. ఆకాశాన అక్కడక్కడ కొన్ని పక్షులు రెక్కలు కదల్చకండా మందసంచారం చేస్తున్నవి. వీస్తోన్న చల్లని గాలికి నా దగ్గరి వేపచెట్టుమీది కొమ్మలు ప్రియుల చక్కిలిగింతలకు త్రుళ్ళిపడే యువతుల్ని అనుకరిస్తున్నవి. నా కప్పుడొక వింతైన పాట వినిపించింది—

"నీలిమాకాశ సౌధాన
నెల నెలంత
నవ్వు వెన్నెల వలచి—పొంగారుచున్న
అశ్రు జలరాశి బడి, ఈదులాడుకొనుచు
అరుగుచున్నాను యామ్యాల యమున కకట!"

రహస్యంగా ఉపభర్తను కూడుకోటానికి వెళ్ళే వగలాడి గుండె దడదడలాగ బడబడా వచ్చేసింది వానజల్లు. పాటలోని కరుణ వేదనకు ఖేచరుల కన్నీటి ముత్యాలా, వాన చినుకులా? తటపట శబ్దించినై చెట్లఆకులమీద.

ఇంతలో మొయిలుతెర విడిపోయి సూర్యబింబం ప్రకాశమానమయింది. వానజల్లు చరచరా దాటిపోయింది. పరిణతాతపప్రవాహంలో సుస్నాతములై బాల వృక్షాలు విరాజిలుతున్నవి. ఒక రంగురంగుల మెట్టతామరపూవు తుమ్మెద పాట వింటూ లజ్జ నభినయిస్తోంది. రాగరంజితమై కనిపిస్తోంది వాతావరణం.

3

ఆ తగ్గుస్థాయిలో అంత మధురంగా ఆపాట పాడింది ఎవరు? వెనక్కుతిరిగి చూచాను. కొంచెందూరాన ఒక ఎలెక్ట్రిక్ స్థంభానికి ఆనుకుని అటు ముఖం పెట్టి కూచున్నాడెవరో. నాకు నీడయిస్తోన్న వేపచెట్టుమీది ఆకుల సందుల్లోనించి రెండు చల్లని నీటి చుక్కలు నా చెక్కిలిమీద రాలిపడ్డవి. తుడుచుకుని మళ్ళీ సరిగా తిరిగి కూచున్నా.

ఛందోబద్ధములైన మధురశబ్దాలలోనూ, ప్రకృతి సౌందర్యంలోనూ, ఎంత

విజ్ఞానవిషయాలు

గర్జించేటప్పుడల్లా సింహం తన తలని నేలకుదగ్గరగా వుంచుతుంది.

* * *

సాధారణంగా మానవుని శరీరంలో ఎల్లప్పుడూ 98.6 డిగ్రీల వేడి వుంటుంది. కప్పవంట్లో వేడి 48 డిగ్రీలు మాత్రమే.

* * *

ప్రపంచంలోకల్లా ఉన్నతస్థలంలోవుండే పట్టణం లాపాజ్. అది దక్షిణ అమెరికాలోని బొలివియాకు రాజధాని. సముద్రమట్టానికి 12,470 అడుగుల ఎత్తునవున్న కొండమీద ఆనగరం కట్టబడింది.

* * *

అసలు ముత్యాలు చేతముత్యాలకంటె గట్టిగా వుంటాయి.

* * *

ప్రతి బ్రిటిష్‌పౌర చతుష్టయంలోనూ ఒకడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇండియావల్ల జీవిస్తున్నాడని సర్ విలియమ్ జాయిన్‌సన్‌హిక్సు చెబుతున్నాడు.

* * *

లండన్‌లోని కుక్కల జనాభా ఐదులక్షలని అంచనా వేయబడింది.

* * *

రష్యన్ జారులలో భయంకర బిరుదాంకితుడైన ఇవాన్ అనే పేరుగలవాడు తాను చేతికర్రగా ఉపయోగించే ఇనపబెత్తంతో పొడిచి కన్నకొడుకుని చంపాడు.

* * *

ఇంగ్లీషుభాషలో ఇ అనే అక్షరం అన్ని అక్షరాలకంటె ఎక్కువగా ఉపయోగింపబడుతుంది.

* * *

బుధకుజ గ్రహాలకు మధ్యనువున్న చిన్నగ్రహాలన్నీ ఒకనాటి పెద్దగ్రహపు శకలాలైవుంటాయని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయం.

* * *

ఒకటిన్నర అంగుళముల దళసరిని నీటిమీద తేలే మంచుపలకమీద మనిషి నిలబడవచ్చు. ఐదు అంగుళాల దళసరి మంచుపలకమీద గుర్రంసహా బండి మునిగిపోకుండ నిలబడవచ్చు.

ప్రభావం ఉంది? అబోధపూర్వములైన జన్మాంతర సౌహృదాల్ని కూడా స్మరింపజేస్తాయి. నా మనస్సు మంచు తెరలు చీల్చుకుంటూ స్మృతిపథంలో పరుగిడుతోంది. ఆగింది ఒకచోట చటుక్కున...

...మొదటి రీల్—స్కూలుకు వెళ్లే దోవలో ఒక చిన్న సందు. రఘువుండే యిల్లు అక్కడే. స్కూలు ఫైనల్ కుర్రాడు; బాగా ఆడతాడు ఫుట్ బాల్. రెండుమూడు మెడల్సు ఉన్నాయి అతనికి...చేతిలో ఒక కాగితం పట్టుకుని వాళ్ళగుమ్మందగ్గిర నిల్చుని ఉన్నాడు...

ఆకుపచ్చ సిల్కుపరికిణీ మీద గులాబిరంగు వలెవాటుతో—చేతిలో థర్డు ఫారం పుస్తకాలు పట్టుకుని వస్తోంది వీణ. ఆ మధ్యాహ్నపు ఎండకు నుదుటి మీద చెమటచుక్కలు చెదరినవి.

'ఇదిగో, వీణా!'

ఇదివరకెన్నడూ రఘువు తన్ను పలకరించలేదు. సిగ్గొచ్చింది వీణకు. బుగ్గలు జేగురించినవి. నడక మందగించింది.

రఘువు మెట్లుదిగివస్తూ 'మరేంలేదు; ఈ సెలవుచీటి కాస్త హెడ్మాస్టరుగారి కిచ్చివెయ్యి. ఇందాకటినించీ చూస్తున్నాను; ఏ కుర్రాడూ కనిపించలేదు. ఇవాళ తలనొప్పిగా ఉంది; స్కూలుకు రాలేను'' అంటూ కాగితం అందించాడు.

తను తీసికెళితే బాగుంటుందా? అన్న ప్రశ్న వచ్చిందిగాని, వీణ ఆచీటి అందుకోకండా, నిరాదరణగా సాగిపోలేకపోయింది. ఆమె చీటితీసుకుంది. జడలోని చేమంతిపూవొకటి కింద వాలింది; రఘువు అది వొంగి తీసుకుని ఆఘ్రాణిస్తూ ఇంట్లోకి వెళ్లాడు.

... ...

రెండో రీల్ : జిమ్ఖానాక్లబ్బు ఆవరణలో ఫుట్ బాల్ పోటీపందేలు జరుగుతున్నై. ఆరోజున రఘుకు 'రౌండు' లేదు. వాలంటీరుపని చేస్తున్నాడు. వీణా, ఆమె తండ్రీ ఆట చూచేందుకు వచ్చారు. ఎంత మర్యాద చేస్తున్నాడు రఘు వాళ్లకు; తన యిల్లు కాకపోయినా. ఆమర్యాద! ఆస్వాగతం! అనేకమంది వస్తున్నారు; వాళ్లంతట వాళ్లే ఖాళీగాఉన్న కుర్చీలలో కూచుంటున్నారు. రఘు ఆ తండ్రీ కూతుళ్లకు ఎదురు వెళ్లాడు; తీసుకొచ్చి ప్రత్యేకాసనాలు చూపించాడు; సోడాలు కావాలేమో అడిగాడు. ఆయన పెద్ద గవర్నమెంటు ఉద్యోగస్థుడవటంచేత అంత మర్యాద జరుగుతోందనుకున్నారంతా. 'వీణను చూచేసరికి మనవాడెలా అయినాడో చూచావుట్రా' అంటున్నాడు రఘుతరగతివాడొక్కడు పక్కని స్నేహితుడితో. 'స్కూలు ఫైనలు అయాక వాళ్ళింట్లో బట్లరు ఉద్యోగమే మనవాడికి' అని రెండోవాడి ప్రతివచనం. వీణ వాళ్లిద్దరికేసి చురుగ్గా చూచి తలవొంచుకుంది.

... ...

మూడోరీల్ : తూర్పువేపు ఆకాశాన బారెడుమాత్రం ఎక్కివచ్చిన సూర్యబింబం దర్శనీయంగా ఉంది. జడ వేసుకుని, నీళ్లుపోసుకుని, గళ్లపరికిణీ గోధుమరంగు పమిటా సింగారించుకుని, వీణ వాళ్ల పెరటితోటలో పువ్వులు సేకరిస్తోంది. వనస్పతులు తమంతతామే గాలికి వొంగి పువ్వులందిస్తున్నై. బైట నుంచి...

'వీణా!'

ఆమె ఉలికి పడ్డది. ఎవరది? గోడ అవతల వీధిలో రఘును చూచింది వీణ. పుష్పాపచయం మానేసి, తలెత్తి.

'నువ్వా? రఘు! లోపలి కొస్తావా? ప్యాసయ్యావు కామాలు; ఉద్యోగ ప్రయత్నంమీద మా నాన్నగారితో మాటాడ్డానికేనా? వున్నారు ఇంట్లో'

రఘు నిశ్శబ్దంగా ఆమెకేసి చూస్తూ వుండిపోయాడు.

'ఏమిటో విచారంగా వున్నావే!'

'ఏమీలేదు...మీరు రేపేనా ప్రయాణం?'

'ఔను, రేపు సాయంత్రం నాలుగు గంటలబండికి. మా నాన్నగారికి బదిలీ అయిందిగా!'

'వచ్చేసంవత్సరం ఫోర్తు ఫారం ఇక్కడ చదవ్వన్నమాట!'

'ఊహుఁ, అక్కడే...లోపలికి రా. భయంలేదు.'

'నాకు పువ్వులు కావాలి.'

వీణ పక్కున నవ్వింది...

'ఎందుకు నీకు పూలు?'

రఘు మాటాడలేదు. గంభీర మౌన ముద్ర!

'ఏం జేసుకుంటావు పువ్వులు?'

'కావాలి.'

'మీ చెల్లెలి కిస్తావా? నీకు చెల్లెలుందా అసలు?'

ఇంతలో...

'అమ్మా! వీణా!' ... లోపలినించి కేక.

'అదిగో మా నాన్నగారు పిలుస్తున్నారు, వెళ్లాలి'...వీణ వెళ్లిపోడానికి వుద్యుక్త అయింది.

'పువ్వు లియ్యవూ మరి?'

‘నీకెందుకు లెద్దూ పూలు!’ అని వీణ గబగబా వెళ్లింది. ఒక్కసారి మాత్రం వెనక్కు తిరిగిచూచింది. ఎంతదీనంగా, కళావిహీనంగావుంది అతని ముఖం!

మళ్లీ ఇన్నాళ్లకు ఆ కళావిహీన ముఖమే ఇవాళ...

—సినీమాదృశ్యాలు ఆగిపోయి... మా నాన్నగారు వస్తున్నారేమోనని చూచాను రేడియో రిసీవింగు స్టేషనుకేసి. ఆయన ఇంకా మిత్రుడితో మాటాడుతునే వున్నారు కొమాలు లోపల.

ఇంతలో నా వెనుక ఆ ఎలిక్ట్రిక్ స్తంభం దగ్గరి వ్యక్తి లేచాడు. అతని ముఖం కనిపించింది. ఔనా, కాదా, అన్న సంశయం ఎంతోసేపు లేదు.

ఆ కళా విహీనముఖమే పన్నెండేళ్ల తరువాత ఇవాళ మళ్లీ చూస్తున్నాను.

వెళుతూ వెళుతూ నేను కనిపించగానే ఆగాడు. పోయినప్రాణం లేచి వచ్చినవాడులాగ అయి ‘ఎవరు? వీణా!’—మాటలు కావవి. ఆవేశపూరితమై పగిలిపోయిన గుండె తునకలు...

‘ఔను, నేనే.’ సిమెంటు బల్లమీది నించి దిగి నమస్కారం చేశాను.

అతడు నన్ను సమీపించాడు. అతడు నాకేసి చూచే చూపులలో పాల సముద్రం పొంగుతోంది; ఒక నిమిషంకింద నిస్తేజమై వుండిన అతని ముఖమండలం చంద్రబింబాన్ని బురుడిస్తోంది.

‘సుఖంగా వున్నావుకదా వీణా!... ఈ పూళ్లో వుంటున్నారా?... మీవారు ...ఏం పని?...’

టూకీగా చెప్పాను; మానాన్నగారు రిటైరు అయింతర్వాత ఈ వూళ్ళో నే... అన్ని సౌకర్యాలూ వున్నాయని... ఇల్లు కట్టుకుని వున్నారనీ, ఆయన కీ మధ్య సుస్తీ చేసినందున చూచిపోయేందుకు వచ్చాననీ—ఇంకా—

‘నువు చాల మారిపోయావు వీణా. నా మనసులో వున్న ఓ అప్పటి భర్త ఫోరం వీణ మారలేదు. అందుచేతే చప్పున గుర్తుపట్టలేక పోయాను. ఊం, కులాసాగా వున్నావు కదూ!’—ఇంకా ఏమిటో కావలపినంత చెప్పా లనుకుంటూ... చెప్పలేని మూగవాడువలె—ముఖంలో వివిధభావశబలత దాగం తట అది ప్రకట మౌతూ వుండగా... నాకేసే చూస్తూ నిల్చిపోయాడు.

నే నతని ముఖంలోకి చూళ్లేక చూపుల్ని అతనిచేతిలోని పుస్తకంమీదికి దించాను. ఆతని భావతీవ్రతకూ, నాభావసవ్యాతకూ, రవంత విశ్రాంతి కలిగిద్దామన్న తలపుతో నేనువాక్కు తెచ్చుకుని...

‘ఆ పుస్తకం...’

అర్ధోక్తిలోనే అత డందుకుని... “ఈపుస్తకమా! ఇది ‘ఎండిమియాన్’ అని ఒక ఇంగ్లీషుకావ్యం. ‘కీట్సు’ కవి రాశాడు. ఒకడు చంద్రబింబాన్ని వరించి, దానికోసం తహతహపడి, పాతాళుడై మరణిస్తాడు—అదీ ఇందులో కథా వస్తువు. ఇది నా నిరంతర పారాయణ గ్రంథం” అన్నాడు.

ఒక నిమిషంసేపు ఎవరమూ మాటాడలేదు. ఒక పెద్ద గాలికెరటం వృక్షశాఖల్ని రివ్వున ఊగించి దాటిపోయింది.

“ఇక నేను వెళ్లొస్తాను వీణా! ఎన్నాళ్లకు కనబడ్డావు! ఇవాళ సుదినం. నా హృదయంలోని హిమాలయ పర్వత గహ్వరాల్లో విద్యుత్కాంతులు ప్రజ్వలిస్తున్నట్టు అనుభవిస్తున్నాను. వెళ్లనా? నువు సుఖంగావున్నావుకదా...!”

నేను తలెత్తి అతని కన్నులలోకి చూచాను, మిలమిల మెరుస్తోన్నవి అవి ...దీపశిఖ అంతిమకాంతివలె.

నా నమస్కారం అందుకుని వెళ్లిపోతున్నా డతను. నేను అటుకేసే చూస్తూ స్తంభీభూత నయాను.

ఇప్పటికీ నాకావాక్యం చెవులలో ధ్వనిస్తోంది: ‘నువు సుఖంగా వున్నావు కదూ!’

కోర్కెలు

౧

నీ చిత్రంబెల్ల
నింపు మోదముతోడ
గానంబుసేయగా
గావింపుమయ్యనన్
కవికుమారుడనుగా!

౨

నిఖిల జగములలోన
నీ లీలలెల్ల స్మ
రించుచు చిత్రముల్
చిత్రంబుసేయగా
చేయుమయ్యానన్ను, చిత్రకా
రుడనుగా!

౩

నీదు సచ్చరితంబు
నిఖిలజగములలోన
నిలిపి పాపముబాప
నీభక్తకోటిలో
తావునా కొసగుమో
తామరసనేత్ర!

—మల్యాల వేంకటశివరామకృష్ణ